రోగుల కష్టాలు తీరేదెన్నడో!

● నిలిచిన పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు ● ఇబ్బందులు పడుతున్న రోగులు



వెల్దండలో అసంపూర్తిగా ఉన్న నూతన భవన నిర్మాణం

వెల్దండ: గ్రామీణులకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం శిథిలావస్థలో ఉండడంతో గత ప్రభుత్వం నూతన భవనం నిర్మాణం కోసం రూ.50 లక్షలు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు స్లాబ్, గోడల వరకు నిర్మించారు. నిధుల కొరతతో పనులను నిలిపివేశారు. దాదాపుగా నాలుగేళ్లు దాటిన నేటికి ఆస్పత్రి నిర్మాణం పూర్తికాలేదు. 2021 సంవత్సరం మే నెల నుంచి మండల కేంద్రంలో మహిళా సమాఖ్య భవనంలో రోగులకు సేవలు అందిస్తున్నారు. రోగుల తాకిడి అధికం కావడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అదే విధంగా శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మరమ్మతుల కోసం గతంలో రూ.40లక్షలు మంజూరు చేశారు. కాంట్రాక్టర్లు పనులు దాదాపుగా పూర్తి చేసిన బిల్లులు రాలేదని భవనానికి తాళం వేశారు. తాగునీరు పైపులైన్, మరుగుదొడ్ల నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలి శారు. పెండింగ్ బిల్లులు వస్తేనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు.

మహిళా రోగులకు తప్పని ఇబ్బందులు

మండలంలో అధికంగా గిరిజన తండాలు ఉండడంతో ప్రతి రోజు ఆస్పత్రికి తండావాసులు వస్తుంటారు. ప్రతి రోజు సాధారణంగా 150 నుంచి 200 మంది వరకు ఓపీ చూస్తున్నారు. మహిళ రోగులకు సరైన వసతులు లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులు, కల్వకుర్తి, ఆమనగల్లు పట్టణాలకు వెళ్తున్నారు. తాత్కాలికంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వతులు లేకపోవడంతో గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నీటి వసతి, కాన్పుల గదులు లేక నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రసవాల కోసం వచ్చేవారిని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి రేఫర్‌చేస్తున్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. 24 గంటల వైద్య సేవలను అందించాలని నింబధనలు ఉన్న మరో మెడికల్ ఆఫీసర్, ముగ్గురు స్టాఫ్‌నర్సులు, అటెండర్ పోస్టు, కాంటిజెంట్ వర్కర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వెల్దండ, కుప్పగండ్ల, బొల్లంపల్లి గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రలోని మొదటి ఏఎన్‌ఎంలు ఖాళీగా ఉన్నాయి. జిల్లా వైద్య అధికారులు స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మరమ్మతు చేసినా అందుబాటులోకి రాని భవనం

అవస్థలు తప్పడం లేదు



తాత్కాలికంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతులు లేవు. వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నాం. సొంత భవనం ఉంటే రోగులకు, వైద్యులకు ఇబ్బందులు తలెత్తాయి. ఏళ్లు గడుస్తున్న నేటికి నూతన భవనాన్ని పూర్తి చేయలేదు. అధికారులు స్పందించి త్వరగా భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలి.

– జోగయ్య, వెల్దండ

ప్రసవాల సంఖ్య తగ్గుతోంది



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గతం కంటే ప్రసవాల సంఖ్య తగ్గింది. తాత్కాలిక భవనంలో ప్రసవాల గది లేదు. రోగులకు వైద్యం అందించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ప్రసవాల కోసం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నాం. సిబ్బంది కొరత ఉంది. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనానికి మరమ్మత్తులు పనులు దాదాపుగా పూర్తి అయ్యాయి. పనులు పూర్తి చేసిన సంబంధిత కాంట్రాక్టర్ ఆస్పత్రిని అప్పగించడం లేదు.

– సింధు, డాక్టర్ వెల్దండ

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



కొల్లాపూర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు



చారకొండలో..

కొల్లాపూర్: పట్టణంలోని ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ దుకాణాల్లో పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేశారు. బుధవారం పట్టణంలోని వెంకటేశ్వర ఆగ్రో రైతు సేవాకేంద్రం, కార్తీకేయ ట్రేడర్స్, ఆగ్రోస్ రైతు సేవాకేంద్రాల్లో వారు తనిఖీలు చేపట్టారు. దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను, బిల్ బుక్కులను పరిశీలించారు. తనిఖీల్లో సీఐ.మహేష్, ఎస్‌ఐ.హృషికేష్, ఏఓ. చిన్నహుస్సేన్ యాదవ్ తదితరులున్నారు.

లైసెన్స్ రద్దు చేస్తాం

తిమ్మాజిపేట: మండలంలోని అమ్మపల్లిలో బుధవారం విత్తనాలు దుకాణాన్ని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన దుకాణం యజమానికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. దుకాణంలోని పలు రికార్డులను ఆయన పరిశీలించారు.

రికార్డుల పరిశీలన

తెలకపల్లి: నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని ఏఓ నర్మద హెచ్చరించారు. మండల కేంద్రంలో వివిధ ఫర్టిలైజర్ దుకాణాలను ఎస్‌ఐ నరేష్‌తో కలిసి ఏఓ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు.

ఆకస్మిక తనిఖీ

చారకొండ: రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి తనూజరాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో సీడ్ టాస్క్‌ఫోర్స్ మెంబర్(ఏఓ) తనూజరాజ్, ఎస్‌ఐ శంషోద్దీన్ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణంలో విత్తనాలు, ఎరువులు స్టాక్‌తోపాటు రైతులకు విక్రయిస్తున్న బిల్లు, రికార్డుల నిర్వహణ సీడ్ లేబుల్ తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలర్లు నిబంధనలు ఉల్లంఘించొద్దన్నారు. ధరల పట్టిక ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను నిర్ణీత ధరకు, రైతులకు తప్పని సరిగా రశీదును ఇవ్వాలన్నారు. మండలంలోని దుకాణాల్లో నిల్వ ఉన్న విత్తనాలను ల్యాబ్‌కు పంపిస్తామని పేర్కొన్నారు. వారి వెంట డీలర్లు, సిబ్బంది ఉన్నారు

నేడు, రేపు పాత్రికేయులకు శిక్షణ తరగతులు

అచ్చంపేట/మన్ననూరు: అమ్రాబాద్ మండలం మన్ననూర్ అటవీశాఖ వనమాలికలో ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 29, 30వ తేదీల్లో పాత్రికేయులకు రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మీడియా కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సంపాదకులు మార్కండేయ, కె.శ్రీనివాస్, దిలీప్‌రెడ్డి, ఆర్.రామారావులు హాజరవుతారని పేర్కొన్నారు. జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌కు సన్మానం

వెల్దండ: మండలంలోని కొట్ర గేట్ వద్ద బుధవారం రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని టీయూడబ్ల్యూజే(ఐజేయూ)జిల్లా అధ్యక్షుడు గోలి సుదర్శన్‌రెడ్డితోపాటు కల్వకుర్తి, వెల్దండ జర్నలిస్టులు ఘనంగా సన్మానిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని మన్ననూరులో గురువారం నుంచి నిర్వహించే జర్నలిస్టుల శిక్షణ తరగతులకు హాజరుకావాలని కోరారు. జర్నలిస్టులు సమాజ శ్రేయస్సు కోసం దృష్టిపెట్టి కథనాలు రాయాలన్నారు. జర్నలిస్టులు బాలయ్య, శ్రీను, సమీర్, జహీర్, బాల్‌జంగయ్య, నరేష్, రవీందర్‌రావు, శ్రీనివాసులు ఉన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న దేశ్యానాయక్

అచ్చంపేట రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దేశ్యానాయక్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని టీఎన్‌జీఓ భవనంలో సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ్యానాయక్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. నల్లమల్ల ప్రాంతంలో పరిశ్రమలను స్థాపించి నిరుద్యోగ యువతీ, యువకులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. సీపీఎం నాయకులు రాములు, సైదులు, నాగరాజు, సయ్యద్, పర్వతాలు, వెంకటయ్య, నిర్మల, సైదమ్మ, రజిత పాల్గొన్నారు.

రసాయనిక ఎరువులు అధికంగా వాడొద్దు



కరపత్రాలు విడుదల చేస్తున్న శాస్త్రవేత్తలు

తెలకపల్లి: రసాయనిక ఎరువులు అధిక మోతాదులో వాడొద్దని వ్యవసాయ శాస్త్రవేత్త చరన్‌తేజ అన్నారు. బుధవారం గడ్డంపల్లిలో రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పప్పుజాతి పంటలు సాగు చేయడం వలన గాలిలో నత్రజని స్వీకరించి మొక్కలకు అందిస్తుందన్నారు. భూ సార పరీక్షలు చేయించుకోవాలని ఎరువులను మోతాదులో వేసుకోవాలని, ఏ భూమిలో ఏ పంటలు సాగు చేయాలో తెలుసుకోవచ్చన్నారు. యూరియా వాడకాన్ని తగ్గించి పచ్చిరొట్టలను అవసరాలను బట్టి సాగు చేయాలని రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి సంవత్సరం పంటమార్పిడీ చేయడం అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. పొలం గట్ల మీద, కానుగ, కరివేపాకు చెట్లను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు జోయల్, సాయికావ్య, ఏఈఓ నర్మద, స్రవంతి, హైజియా, హరినాథ్, అభినవ్, రైతులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



తిమ్మాజిపేట: ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులకు సూచించారు. మండలంలోని ఇప్పలపల్లిలో బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో లబ్ధిదారురాలు రేణుక ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ భవన నిర్మాణం పనులను పరిశీలించి నాణ్యతగా పనులు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా మరికల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఆయన వెంట హౌసింగ్ పీడీ సంగప్ప, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీఓ లక్ష్మీదేవి, ఏఓ కమల్‌కుమార్, పలు శాఖల అధికారులు ఉన్నారు.

సేవాదృక్పథం అలవర్చుకోవాలి

కల్వకుర్తిరూరల్: ప్రతి సేవాదృక్పథం అలవర్చుకోవాలని స్వామి వివేకానంద సేవాబృందం అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. పాత దుస్తులను సేకరణలో భాగంగా బుధవారం పట్టణంలోని శుభాష్‌నగర్ కాలనీకి చెందిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ సుధాకర్ నుంచి పాతదుస్తులను సేకరించారు. ఈ దుస్తులను అవసరమైన పేదలకు అందజేస్తామని శివకుమార్ తెలిపారు. కార్యక్రమంలో తలసాని గౌతంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



తప్పిన ప్రమాదం

కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాల గేట్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున లారీ డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఏమి కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. స్థానికుల వివరాల ప్రకారం జడ్చర్ల నుంచి కల్వకుర్తి వైపు లారీ లోడ్‌తో వెళ్తోంది. మార్గమధ్యలో మార్చాల గేట్ వద్ద ప్రమాదవశాత్తు డివైడర్ కొన్నది. ప్రమాదంలో లారీ ముందు భాగం దెబ్బతింది.



ఎమ్మెల్యే వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలి

మన్ననూర్: ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సంబు శోభ వెంకటరమణ, మాజీ మండల కో ఆప్షన్ సభ్యుడు ఎంఏ రహీం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బుధవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారని తెలిపారు.

కేజీబీవీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోడేరు: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రత్యేక అధికారి కవిత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనాథలు, నిరుపేదలు, తల్లిదండ్రులు లేని పిల్లలు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అదే విధంగా కస్తూర్బా పాఠశాలకు నూతనంగా జూనియర్ కళాశాలలో ఆర్టిఫిసియల్ ఇంటలిజెన్స్ మెషనరీ లర్నింగ్ కోర్సు ఉందని వాటిలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దరఖాస్తులు చేసుకునే వారు 10వ తరగతి మెమో, ఫొటో, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బోనంఫైడ్, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

మెడికల్ కిట్ల పంపిణీ



కల్వకుర్తిరూరల్/వెల్దండ: కల్వకుర్తి మండలంలోని తర్నికల్, తర్నికల్ తండాలలో ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన మెడికల్ కిట్లను బుధవారం గర్భిణులకు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సురేష్‌గౌడ్, జాగృతి జిల్లా అధ్యక్షుడు దారమోని గణేష్, రుక్నుద్దీన్, శ్రీధర్‌గౌడ్, కృష్ణయ్య, నర్సింహ, పరశురాముడు, శ్రీకాంత్, పాల్గొన్నారు.

కొట్రలో..

వెల్దండ మండలంలోని కొట్రలో బుధవారం మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు గర్భిణులకు ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో సమకూర్చిన మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. సత్యనారాయణ, భూపతిరావు, కరుణాకర్‌రావు, దశరథం, అశోక్, అంగన్‌వాడీ కార్యకర్తలు వరూధిని, ఊర్మిళ, అలివేలు, తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

కొల్లాపూర్: పట్టణంలో బుధవారం సినీనటుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి వేడుకలను టీడీపీ నాయకులు నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేదలకు అహార పొట్లాలు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బరిగెల సత్యనారాయణయాదవ్, వురి సుధాకర్, బాబురెడ్డి, చంద్రయ్యయాదవ్, కురుమయ్య, చందన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

వీపనగండ్ల: ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉన్నపుడే వాటి బారిన పడకుండా తప్పించుకోవచ్చని హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనదారులు నిబంధనల ప్రకారం వాహనాలు నడపాలని, మద్యం తాగి వాహనాలు నడపి ప్రమాదం జరిగితే కుటుంబం రోడ్డున పడుతుందన్నారు.

ఉద్యోగాల కల్పనలో కేంద్ర ప్రభుత్వం విఫలం



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

లింగాల: ఉద్యోగాల కల్పనలో కేంద్ర ప్రభుత్వం విఫలం అయ్యిందని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మారాడు శివశంకర్ ఆరోపించారు. ఈ నెల 31న అచ్చంపేటలో నిర్వహించే సీపీఐ 18వ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను బుధవారం మండలంలోని అంబట్‌పల్లిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించిందని విమర్శించారు. పథకాలు అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని, ప్రజల పక్షాన ఉంటూ కొన్ని దశాబ్దాల నుంచి సీపీఐ పోరాటాలు చేస్తుందన్నారు. మహాసభలకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు పార్వతమ్మ, సాయిబాబు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గౌరెటి నరేష్, శివకుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి



నాగర్‌కర్నూల్ రూరల్: ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలని మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐగా పదోన్నతి పొందిన తగిలి వెంకటపతి ఆయన సన్మానించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్, కోటేశ్వర్, సలహాదారు కృష్ణయ్య, శోభన్‌బాబు, బాలరాజు, కురుమయ్య, యాదయ్య, రవికుమార్, బాలరాజు, మదిలేటి, శేషగిరి, సుధాకర్, వెంకటేష్, పర్వతాలు, సైదులు, నిరంజన్, దళిత అవార్డు గ్రహీత చింత సత్తి, చంద్రయ్య, వెంకట్‌నారాయణ, బాలస్వామి, తిరుపతయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



మన్ననూర్: అమ్రాబాద్ మండల కేంద్రంలోని పలు కాలనీలలో వారం రోజులుగా తీవ్ర నీటి ఎద్దడి నెలకొనడంతో బుధవారం కాలనీవాసులు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడారు. మండల కేంద్రంలోని వివిధ కాలనీలలోని 8 బోర్లు పని చేయడం లేదని అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు పూర్తిగా రావడం లేదని దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సతీష్, శంకరయ్య, వెంకటేష్, అభిరామ్, లక్ష్మయ్య, సత్యనారాయణ, విష్ణుచారి, చక్రపాణి మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

బిజినేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈర్ల చంద్రమోళి అన్నారు. బుధవారం మండలంలోని మమ్మాయిపల్లి గ్రామంలో 4వ శాఖ మహాసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. మమ్మాయిపల్లి గ్రామశాఖ కార్యదర్శి జి.నారాయణ. సహాయ కార్యదర్శిగా తిరుపతయ్య, కోశాధికారిగా పి.రాజులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కృష్ణాజీ, తదితరులు పాల్గొన్నారు.

తపాలాశాఖతో మరిన్ని సేవలు



నాగర్‌కర్నూల్ రూరల్: తపాలాశాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని భవిష్యత్‌లో మరిన్ని సేవలు అందించనున్నట్లు ఆ శాఖ డివిజన్ పర్యవేక్షకుడు భూమన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలకు చెందిన గ్రామీణ తపాలాశాఖ బీపీఎంలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టల్ అధికారులు సైదానాయక్, సృజన్ నాయక్ మాట్లాడుతూ.. 2.0 సాంకేతికతతో అందించాల్సిన సేవలపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి అందరి మన్ననలు పొందాలన్నారు. శిక్షణ అనంతరం అధికారులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రసాద్, మహమ్మద్ ఖాన్, జగన్, రాంరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రిన్సిపాల్‌కు అభినందన



తెలకపల్లి: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఇంటర్ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురుకుల ప్రిన్సిపాల్ ఏఆర్.లక్ష్మీ, ఉపాధ్యాయ బృందానికి ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.

రేపు వాహనాల వేలం

కల్వకుర్తిరూరల్: కల్వకుర్తి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వివిధ నేరాలలో ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న 23 ద్విచక్ర, త్రిచక్ర, ఫోర్ వీలర్ వాహనాలను ఈ నెల 30న వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కార్యాలయంలో వేల పాట ప్రారంభమవుతుందని తెలిపారు.

30న చలో కలెక్టరేట్

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించాలని డిమాండ్‌తో ఈ నెల 30న చలో కలెక్టరేట్ నిర్వహిస్తునట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహ్మ అన్నారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలకు టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్లు, సరఫరా చేయాలని పారలు, తట్టలు, గడ్డపారలు తదితర సామాగ్రిని ప్రభుత్వం సరఫరా చేయాలని కోరారు. పెండింగ్ బిల్లులను తక్షణమే కూలీలకు చెల్లించాలన్నారు. సుభాష్, జనార్దనచారి, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలి



నాగర్‌కర్నూల్ రూరల్: ప్రభుత్వం ప్రతి నెల 30న నిర్వహించాల్సిన పౌరహక్కుల దినోత్సవాన్ని జరిపించడం లేదని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరశురాములు విమర్శించారు. బుధవారం కేవీపీఎస్ జిల్లా కమిటీ సమావేశం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఇంకా కుల వివక్షత అంటరానితనం కొనసాగుతుందన్నారు. దళితులపైన దాడులు దౌర్జన్యాలు చేయడం అమానుషం అన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, సహాయ కార్యదర్శి రాజు అశోక్, కృష్ణయ్య, మల్లేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.25వేల విరాళం

వెల్దండ: మండల కేంద్రంలోని బీరప్ప దేవాలయ నిర్మాణానికి బుధవారం బీఆర్‌ఎస్ నాయకుడు జోగయ్య రూ.25వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరు భక్తిభావంతో మెలగాలన్నారు. ఆలయ నిర్మాణానికి దాతలు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు చంద్రమోహన్‌రెడ్డి. లింగం ముదిరాజ్, నిరంజన్, ఆనంద్‌కుమార్, మట్ట శ్రీనివాస్‌గౌడు, వెంకటయ్య, రవికుమార్, నాగయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ



పెద్దకొత్తపల్లి/మన్ననూర్: మండలంలోని తిరుమలాపూర్‌కు చెందిన చంద్రయ్యకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.50వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు బుధవారం లబ్ధిదారుడికి మాజీ సర్పంచ్ సత్యం చెక్కు అందజేశారు. పేదలు సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామానికి చెందిన కోన శివ శ్వాసకోశ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నాడు. వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.36 వేలు మంజూరయ్యాయి. ఈమేరకు బుధవారం బాధితుడికి కాంగ్రెస్ నాయకులు రహీం, హన్మంత్‌రెడ్డిలు అందజేశారు. డాక్టర్ సురేష్, సైదులు, సత్యనారాయణ, కృష్ణయ్య, వెంకటయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.